

మీర్‌పేట్ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

## మీర్‌పేట్ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

సరూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలంలోని మీర్‌పేట్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె తరగతి గదుల్లోకి వెళ్లి నేరుగా పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ఆమె విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అదే ఆవరణలో కొనసాగుతున్న జూనియర్ కళాశాలను సైతం సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత పౌరులుగా ఎదగాలని ఆమె వారికి సూచించారు. కార్యక్రమంలో స్కూల్, కాలేజీ సిబ్బంది, పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న వివేకానందకాలనీ ప్రతినిధులు

చంపాపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని వివేకానందకాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలో తాగునీరు, డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ, తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. డ్రైనేజీ నిర్మాణం తర్వాత సీసీ రోడ్ల పనులు చేపట్టనున్నట్లు అన్నారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

## సమన్వయంతో కాంగ్రెస్‌ను పటిష్టం చేద్దాం: కోట్ల

సైదాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పాతబస్తీలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి కార్యకర్త పాటుపడాలని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ అన్నారు. బుధవారం సింగరేణికాలనీలో డివిజన్ మాజీ అధ్యక్షుడు నగరిగారి దాస్ ఆధ్వర్యంలో జరిగిన ఐఎస్‌సదన్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సమావేశంలో నేతలు రవిరాజ్, సుబ్రహ్మణ్యం, వినయ్‌కుమార్, సరోజ, వెంకటమ్మ, అలివేలు, శంకర్‌నాయక్, కిషన్‌నాయక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## కమ్యూనిటీ హాల్ ప్రారంభం

హయత్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని శ్రీనివాసకాలనీలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాసకాలనీ ప్రజలు ప్రభుత్వం పైన ఆధారపడకుండా సొంతంగా నిధులు సమీకరించుకుని కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించుకోవడం గొప్ప విషయం అన్నారు. కాలనీ ప్రజలంతా కలిసి కట్టుగా ఉండి కాలనీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మాణిక్‌రెడ్డి, అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

### ఆర్టీసీ మజ్దూర్ కాలనీలో..

హయత్‌నగర్ డివిజన్‌లోని ఆర్టీసీ మజ్దూర్‌కాలనీలో రూ.96.5 లక్షలతో నిర్మించిన భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైను పనులను కార్పొరేటర్ కల్లెం నవజీవన్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో భాగంగా భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైపులైను, సీసీరోడ్లు, వీధి లైట్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సూర్యానాయక్, నర్సింహచారి, శ్రీమన్నారాయణ, మహేష్ పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హయత్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆశీర్వాదంతోనే మన్సూరాబాద్ డివిజన్ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం డివిజన్ పరిధి హయత్‌నగర్ ఏరియాలోని శివగంగకాలనీలో రూ.24లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను కాలనీ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివారు ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజు జీహెచ్ఎంసీ అధికారులను కలిసి తాగునీరు, భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు విషయంపై చర్చించడం జరుగుతుందన్నారు. డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతోనే ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తొంట బాబు, సతీష్‌రెడ్డి, వెంకటేష్, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

## డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలి

కొత్తపేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని కాలనీల్లో పాడైన డ్రైనేజీ మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కాలనీలో పర్యటించారు. కమ్యూనిటీహాల్ సమీపంలో మ్యాన్‌హోల్ పాడై తరచూ మురుగునీరు పక్కన ఉన్న అపార్టుమెంట్‌లోకి చేరుతోందని కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన జలమండలి అధికారులకు సమాచారం ఇచ్చారు. సిబ్బంది కాలనీకి చేరుకుని సదరు మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి, సుభాన్‌యాదవ్ తదితరులు

## నాదర్‌గుల్ రోడ్డును అభివృద్ధి చేయాలి

సరూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ ప్రధాన రహదారిని ప్యాచ్ వర్కులతో సరిపెట్టకుండా పూర్తిస్థాయిలో అభివృద్ధి పరచాలని కాంగ్రెస్ నేతలు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, బంగారు అశోక్, శంకర్, శేఖర్ తదితరులు కలెక్టర్‌ను ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు నాగరాజు, రజనీకాంత్‌యాదవ్, మురళి, శ్రీనుయాదవ్ పాల్గొన్నారు.

## సీవరేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

చాదర్‌ఘాట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి) : ఆజంపుర డివిజన్‌లోని మూసానగర్ బస్తీలో రూ.6లక్షలతో, కమల్‌నగర్ బస్తీలో రూ.8లక్షలతో నూతన సీవరేజీ పైప్‌లైన్‌ను నిర్మిస్తున్నారు. ఆ పనులను జీహెచ్ఎంసీ ఏఈ మల్లికార్జున్, జలమండలి ఆజంపుర సెక్షన్ జూనియర్ టెక్నికల్ ఆఫీసర్ మహేశ్, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షేక్ మోహీయుద్దీన్ అబ్రార్‌తో కలిసి బుధవారం పరిశీలించారు.

# కూల్చివేసినా.. తిరిగి కొనసాగుతున్న సెల్లార్ నిర్మాణ పనులు

- మొక్కుబడిగా వ్యవహరిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు
- ఆందోళనలో స్థానికులు

సైదాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపులేకుండా పోతోంది. లక్ష్మీనగర్‌కాలనీ చౌరస్తాలో నిబంధనలను ఉల్లంఘిస్తూ కనీస భద్రతా ప్రమాణాలు పాటించకుండా అక్రమంగా చేపడుతున్న సెల్లార్ నిర్మాణాలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఓ అపార్ట్‌మెంట్, భవనం పక్కనే సుమారు 260 గజాల స్థలంలో భారీ గుంతలతో సెల్లార్ తవ్వకాలు, నిర్మాణ పనులు జరుపుతుండడంపై కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, అపార్ట్‌మెంట్‌వాసులు సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, టౌన్‌ప్లానింగ్ అధికారులను స్వయంగా కలిసి ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి ఇప్పటికీ రెండు సార్లు నోటీసులు ఇవ్వడంతో పాటు, పలుమార్లు నిర్మాణ పనులు నిలిపివేశారు. అయినా నోటీసులను బేఖాతరు చేసి పనులు చేపడుతుండగా మే 14న సెల్లార్ నిర్మాణాన్ని జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. కొద్ది రోజులు పనులు నిలిపివేసి తిరిగి వారం రోజులుగా యథావిధిగా పనులు కొనసాగిస్తున్నారు. కానీ సదరు భవన యజమాని అధికారుల నోటీసులు, ఆదేశాలు లెక్క చేయకుండా పనులు సాగిస్తుండడం చర్చనీయాంశంగా మారింది. ప్రజాప్రతినిధుల అండదండలు మెండుగా ఉండడంతోనే అక్రమార్కుల ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వివాదం నాలుగు నెలలుగా కొనసాగుతున్నా ఫిర్యాదు చేసినప్పుడే అధికారులు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో కాలనీవాసులు అధికారులు, ప్రజాప్రతినిధుల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్మాణంపై ఏప్రిల్ 21న జీహెచ్ఎంసీ డీసీ సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు సైతం చేశారు. వివరణ కోసం సంబంధిత టౌన్‌ప్లానింగ్ ఏసీపీ స్వామినాయక్‌ను సంప్రదించేందుకు యత్నించగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడం గమనార్హం.





నోటీసులు అతికించిన టౌన్‌ప్లానింగ్ ఏసీపీ స్వామినాయక్, చైన్‌మెన్(ఫైల్), సైదాబాద్ పోలీసులకు అధికారులు చేసిన ఫిర్యాదు

### చర్యలు తీసుకోకపోతే ధర్నా

అనుమతులు లేకుండా కొనసాగుతున్న సెల్లార్ తవ్వకాలపై వెంటనే చర్యలు తీసుకుని నిలిపివేయకపోతే సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో సైదాబాద్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహిస్తామని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్, అధికార ప్రతినిధి వీరేందర్‌బాబు హెచ్చరించారు. పలుమార్లు నోటీసులు జారీ చేసి నిర్మాణాలు కూల్చివేసినా తిరిగి పనులు చేపడుతున్న యజమానిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. రాజకీయ నేతల అండ ఉంటే చర్యలు తీసుకోరా అంటూ ప్రశ్నించారు.



మే14న కూల్చివేసిన సెల్లార్(ఫైల్)



తాజాగా కొనసాగుతున్న నిర్మాణ పనులు

### చర్యలు తీసుకుంటాం

అక్రమ సెల్లార్ తవ్వకాలపై చర్యలు తీసుకుంటాం. గతంలో నోటీసులు జారీ చేసి పనులు నిలిపివేయాలని హెచ్చరించాం. ఒకసారి అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశాం. అయినా తిరిగి పనులు కొనసాగుతున్నాయి. పోలీసుల బందోబస్తు కోరాం. అనుమతి రాగానే సెల్లార్ తవ్వకాలను కూల్చివేసి యజమానిపై కేసు నమోదు చేస్తాం.

\- మంగతాయారు, డిప్యూటీ కమిషనర్, సర్కిల్-7, జీహెచ్ఎంసీ

# కొన్న స్థలాలు అక్రమమంటూ జీఓ తెచ్చి మోసం

- జీఓ 118.. ఓ లొట్టపీసు జీఓ : మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎంతో కష్టపడి కొన్న స్థలాలు, నిర్మించుకున్న ఇళ్లు అక్రమమంటూ జీఓ 118ను తెచ్చి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మోసానికి పాల్పడ్డాడని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన జీఓ 118.. ఓ లొట్టపీసు జీఓ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ధ్వజమెత్తారు. బుధవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సాగర్‌కాంప్లెక్స్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో 118 బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వారి సమస్యలను విన్నారు. జీఓ 118 కారణంగా తమను ఆక్రమణదారులుగా ముద్రవేశారని, కట్టుకున్న భవనాలకు మూడు రెట్లు పన్నులను సైతం విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మధుయాష్కీగౌడ్ మాట్లాడుతూ తప్పుల తడకగా తీసుకువచ్చిన జీఓ 118 తమకు వద్దని బాధిత ప్రజలు కోరుతుంటే.. ఇప్పటికీ ఈ జీఓ ద్వారానే కన్వీనియన్స్ డీడ్ ఇప్పిస్తామని ఎమ్మెల్యే మోసపు మాటలు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరిస్తానని చెప్పిన మాట విస్మరించారని విమర్శించారు. 118 జీఓలోని తప్పులను సవరించాలని సీఎల్పీలో పేర్కొంటూనే బాధిత ప్రజల వద్దకు వెళ్లి కన్వీనియన్స్ డీడ్‌లు ఇప్పిస్తామని మోసపు మాటలు చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్ల సమస్యపై ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వారి దృష్టికి తీసుకువెళ్లానని, త్వరలోనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం చూపబోతుందని మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు రావుల వెంకటేశ్వర్‌రెడ్డి, దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, సుజాతా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, పాశం అశోక్‌గౌడ్, బుడ్డ సత్యనారాయణ, నాయకులు సదాశివుడు, కుట్ల నర్సింహయాదవ్, శ్రీపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌యాదవ్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్

### సీసీ రోడ్ల నిర్మాణానికి కృషి

నియోజకవర్గంలో అవసరమైన ప్రతీ చోట సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తానని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ పేర్కొన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రినగర్ బ్యాంక్‌కాలనీలో సీసీ రోడ్లు నిర్మించాలంటూ బుధవారం మధుయాష్కీ నివాసంలో ఆయన్ను కలిసి కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మధుయాష్కీ త్వరలోనే అధికారులచే సర్వే జరిపించి అంచనాలు రూపొందించి సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాలనీ గౌరవాధ్యక్షుడు భావన శ్రీనివాస్, సభ్యులు భద్రారెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్, శరత్, జయరాం, కృష్ణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలు డబ్బు సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్నారు : ఎంపీ బూర నర్సయ్యగౌడ్



బీజేపీ సంకల్ప సభలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

హయత్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను విస్మరించి డబ్బు సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్నారని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 సంవత్సరాల పాలన పూర్తిచేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని కొహెడాలో నిర్వహించిన సంకల్పసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన ఆర్థిక, సంక్షేమ కార్యక్రమాల వల్ల భారతదేశ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని అన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు ప్రజా సమస్యలను విస్మరించి డబ్బు సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజభూపాల్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రతిపక్ష నాయకులపైన అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. బీజేపీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పోరెడ్డి అర్జున్‌రెడ్డి, బోసుపల్లి ప్రతాప్, నోముల దయానంద్ గౌడ్, సహకార సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, సామల చిన్నబాల్‌రెడ్డి, కందాళ బల్‌దేవ్‌రెడ్డి, వడ్డెపల్లి పాపయ్యగౌడ్, యూసుఫ్‌రెడ్డి, సానెం అర్జున్ గౌడ్, బూర మహేష్, ఎంజాల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

# బడంగ్‌పేట్ పాఠశాలను సందర్శించిన విద్యాకమిషన్ మెంబర్

సరూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా కమిషన్ మెంబర్ జ్యోత్స్నాశివారెడ్డి బుధవారం బడంగ్‌పేట్‌లో నిర్మాణంలో ఉన్న నూతన పాఠశాల భవనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఇంకా అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్త భవనంలో తరగతులు ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతూ ఇటీవల మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళికి వినతిపత్రం అందజేసిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు కమిషన్ మెంబర్ జ్యోత్స్నారెడ్డి బుధవారం పాఠశాలను సందర్శించారు. భవనం నిర్మాణంలో జరుగుతున్న జాప్యం, దానికి గల కారణాలపై ఆమె ఆరా తీశారు. అనంతరం సమీపంలోని ఒకే భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను సైతం ఆమె సందర్శించారు. ఒకే ఆవరణలో, ఒకే భవనంలో రెండు విద్యా సంస్థలు నడుస్తుండడంతో విద్యార్థులకు, అధ్యాపకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ జ్యోత్స్నారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీనికి పరిష్కారం కనుక్కోవాల్సిందిగా ఆమెను కోరారు. ఇక్కడి సమస్యలను, భవనం నిర్మాణ వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తొందరగా నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జ్యోత్స్నారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, ఎంఈవో కృష్ణయ్య, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, రాళ్లగూడెం సంతోషీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి, గట్టు బాలకృష్ణ, బొల్లపల్లి కుమార్, సూర్లగంటి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ స్కూల్‌ను సందర్శిస్తున్న విద్యా కమిషన్ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి, మాజీ మేయర్ పారిజాతారెడ్డి

## పకడ్బందీగా వంద రోజుల యాక్షన్ ప్లాన్

- బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతి

సరూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వంద రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో పకడ్బందీగా నిర్వహిస్తున్నామని, అన్ని విభాగాల సిబ్బందిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని బడంగ్‌పేట్ కమిషనర్ పి.సరస్వతి చెప్పారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 17వ రోజైన బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని మామిడిపల్లిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై ఏర్పడిన గుంతలకు ప్యాచ్‌వర్క్ చేయించారు. అనంతరం ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పారిశుధ్యంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఏఎంసీ శ్యాంసుందర్, డీఈఈ వెంకన్న, మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఎస్ఐ వి.యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, మెప్మా అధికారి శంకర్, పర్యావరణ అధికారి మౌనిక, ఆర్పీలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## బరువు తగ్గితేనే మధుమేహం దూరం

మన్సూరాబాద్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలను పట్టిపీడిస్తున్న వ్యాధుల్లో మధుమేహం ఒకటని, సరియైన ఆహారపు అలవాట్లతో పాటు బరువు తగ్గడంతోనే మధుమేహం వ్యాధి దూరమవుతోందని కామినేని ఆస్పత్రి మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ సందీప్‌రెడ్డి, డాక్టర్ భవాని పేర్కొన్నారు. ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో ప్రతి యేటా జూన్ 9 నుంచి 15వ తేదీ వరకు మధుమేహంపై అవగాహన వారం పాటు నిర్వహిస్తారు. ఈ ఏడాది అవగాహన ముగింపు అనంతరం ఆస్పత్రి ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో 20ఏళ్ల వయసు ఉన్నవారు సైతం మధుమేహం బారిన పడుతున్నారని, వైద్యులను సంప్రదించి వారి సూచనలు, మందులు వాడి బరువు తగ్గితేనే ఈ వ్యాధిని నియంత్రించవచ్చన్నారు. పని ఒత్తిడి, జంక్‌ఫుడ్, మద్యపానం, ధూమపానం వంటివి తీసుకోవడం, ఎలాంటి వ్యాయామాలు చేయకుండా ఉండడంతో మధుమేహం సోకే ప్రమాదం ఉందన్నారు. గర్భం దాల్చినప్పుడు వచ్చే మధుమేహం చాలా ప్రమాదకరమని, దీని పట్ల మహిళలు ఎలాంటి జాప్యం వహించకుండా జాగ్రత్తపడాలని వారు సూచించారు.



న్యాయమూర్తులకు వీడ్కోలు పలికిన న్యాయవాదులు

## శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం

కొత్తపేట : స్నేహపురికాలనీలోని పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వరాలయంలో బుధవారం ప్రసన్నాంజనేయస్వామి ఉపాలయం వద్ద శాస్త్రోక్తంగా మన్యుసూక్త హోమం నిర్వహించారు. వేదమంత్రాల మధ్య జరిగిన ఈ మన్యుసూక్త హోమ కార్యక్రమంలో పరిసర కాలనీల భక్తులు పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయస్వామి ఉపాలయం వద్ద నిర్వహించిన మన్యు సూక్త హోమం

## న్యాయమూర్తులకు వీడ్కోలు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో పనిచేసి బదిలీపై వెళ్లిన పలువురు న్యాయమూర్తులకు బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఘనంగా వీడ్కోలు పలికారు. జస్టిస్ శిరీష, సాయిశరత్‌లను శాలువాలతో సత్కరించారు. విధి నిర్వహణలో సహకరించిన న్యాయవాదులకు వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కార్తీక్, ఉపాధ్యక్షుడు గాలిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు ఎం. లింగం, సాయికుమార్, నిరంజన్‌రెడ్డి, ఇంద్రవర్ధన్‌గౌడ్, నర్సింగరావు, ప్రదీప్, మహిళా ప్రతినిధి అనసూయ, వెంకట్, జక్కుల, విష్ణువర్ధన్‌రెడ్డి, నర్సింగోజి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తు గడువు పొడిగింపు

ఓల్డ్‌మలక్‌పేట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు గడువు పెంచినట్లు వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల నుంచి వికలాంగ సంఘాల నుంచి గడువు పెంచాలని ప్రభుత్వానికి వస్తున్న వినతిపత్రాలు, ఒత్తిడి మేరకు జూలై 1వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఆమె పేర్కొన్నారు. మొదట ప్రకటించిన షెడ్యూలు ప్రకారం ఈ నెల 18వ తేదీ దరఖాస్తు చివరి రోజు కాగా మరో 13రోజులు గడువు పొడి గిస్తూ ప్రభుత్వం ప్రకటన జారీచేసింది. దీంతో వికలాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అర్హులైన వారందరూ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## సిటీ కాలనీలో డ్రైనేజీ ఔట్‌లైన్‌కు సహకరించండి

- ఎంపీ చామ కిరణ్‌కుమార్‌రెడ్డికి కాలనీవాసుల వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ పరిధిలోని సూర్యవంశీగార్డెన్ సిటీకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీలో డ్రైనేజీ ఔట్‌లైన్ సమస్య పరిష్కరించాలని కోరారు. ఔట్‌లైన్ సౌకర్యం లేకపోవడంతో మురుగు నీరు నేరుగా రోడ్డు మీదకు వెళ్తుందని.. దీంతో పరిసర కాలనీవాసులు వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రైనేజీ ఔట్‌లైన్‌కు నిధులను మంజూరు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపీ త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పినట్లు కాలనీ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్‌గౌడ్, ఇస్తారి, శ్యాంసుందర్‌రెడ్డి, జంగారెడ్డి, జాయింట్ సెక్రెటరీ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేషం, దీన్‌దయాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

# మీ సేవ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును మాత్రమే వసూలు చేయాలి

సరూర్‌నగర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మీ సేవ కేంద్రాల నిర్వాహకులు పలు రకాల సేవలకు ప్రభుత్వం నిర్ణయించిన రుసుమును మాత్రమే వసూలు చేయాలని, అంతకు మించి వసూలు చేస్తే చర్యలు తప్పవని బాలాపూర్ తహసీల్దార్ ఇందిరాదేవి హెచ్చరించారు. మండలంలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, సేవలకు అధికంగా రుసుము గుంజుతున్నారంటూ ఇటీవల పలు ప్రాంతాల నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో బుధవారం సదరు కేంద్రాల నిర్వాహకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏయే సేవకు ఎంతెంత ఫీజు వసూలు చేస్తున్నదీ పట్టిక రూపంలో ప్రదర్శించాలని, దరఖాస్తుదారులకు ఫిర్యాదుల పరిష్కార గడువు వివరాలు తెలిపే బోర్డులు సైతం అక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. దరఖాస్తుదారులను అనవసరంగా ఇబ్బందులకు గురి చేయొద్దని, లేనిపోని సాకులు చెప్పి తమ కేంద్రాల చుట్టూ తిప్పుకుని ఎక్కువ ఫీజులు గుంజొద్దని ఆమె స్పష్టం చేశారు. కేంద్రాలను సమయానుకూలంగా తెరవడం, మూయడం చేయాలని, ప్రజలు వచ్చినప్పుడు మూసి ఉంచొద్దని ఆమె సూచించారు. మీ సేవ కేంద్రాల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని, వినియోగదారులను మాత్రం తిప్పలు పెట్టొద్దని ఇందిరాదేవి స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మీ సేవ కేంద్రాలను మూసివేస్తామని, అవకతవకలకు పాల్పడే నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మణిపాల్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మీ సేవ కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇందిరాదేవి

## ఏటీఎం చోరీకి యత్నం



చోరీకి యత్నం చేసిన ఏటీఎం

సంతోష్‌నగర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న కొటక్ మహేంద్ర బ్యాంక్ ఏటీఎం చోరీకి దుండగులు యత్నించారు. బుధవారం తెల్లవారు జామున 3గంటల సమయంలో దుండగులు ఏటీఎం లోకి చొరబడి ఏటీఎం బాక్స్‌ను పగులగొట్టి అందులోని నగదును ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం చేశారు. అయితే ఏటీఎంలో నగదు ఉంచే బాక్స్‌ను తెరవలేకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఐఎస్‌సదన్ పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్‌టీం బృందం వివరాలను సేకరించారు. ఈ మేరకు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తు.. విద్యుత్ స్తంభం ఎక్కిన వ్యక్తి

- విద్యుదాఘాతం.. కాలికి గాయాలు

దిల్‌సుఖ్‌నగర్ : మద్యం మత్తులో ఓ వ్యక్తి విద్యుత్ స్తంభం ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. సరూర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రానికి చెందిన వీరయ్య(40) బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి దిల్‌సుఖ్‌నగర్ మధురాపురి కాలనీలో నివసిస్తూ లేబర్ పని చేసుకొని జీవిస్తున్నాడు. మద్యం తాగే అలవాటు ఉన్న అతడు బుధవారం మధ్యాహ్నం దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలోగల ఎల్‌జీ వైన్స్‌కు వెళ్లాడు. అక్కడ మద్యం తాగుతుండగా పక్కనే ఉన్న మరో మందుబాబుతో అతడికి గొడవ జరిగింది. ఇద్దరి మధ్య వివాదం ముదరడంతో వైన్‌షాపు సిబ్బంది గొడవపడుతున్న ఇద్దరు మందుబాబులపై దాడిచేశారు. వీరయ్య సమీపంలోగల విద్యుత్ స్తంభం ఎక్కాడు. విద్యుదాఘాతంతో కాలికి గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని కిందకు దించి ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.